
ఆంధ్రజ్యోతి

గరిష్టం : 30.0
కనిష్టం : 23.0

ANDHRAJYOTHY



సూర్యాపేట


5

ఆదివారం 21 సెప్టెంబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	2,41,831	2,41,831
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	6,791.62	7,838.65
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.209 (41.5360)	2,20,342	2,12,618

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.255



సూర్యాపేటలో రాజకీయ వేడి

సూర్యాపేట నియోజకవర్గంలో రాజకీయ వేడి పెరుగుతోంది. ఇటీవల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు, ఆరోపణలతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం విషయంలో జగదీష్‌రెడ్డిని తప్పుపట్టారు. దీనితో పాటు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఫొటోలను అమర్చగా, బీఆర్‌ఎస్ నాయకులు ఖండించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి.

\- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

- అధికారంలో కాంగ్రెస్, స్థానికంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే
- ఒకరిపైఒకరు రాజకీయ విమర్శలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తప్పిదాలను ఎత్తిచూపేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించి నిధుల దుర్వినియోగంపై ధ్వజమెత్తారు. మార్కెట్‌ను రూ.32.18కోట్లతో నిర్మించి వృథా చేశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై అవసరమైతే కోర్టులో దావా వేస్తామని కూడా హెచ్చరించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటో లు లేకపోవడంపై మండిపడ్డారు. దాదాపు 40 మంది కార్యకర్తలతో క్యాంప్ కార్యాలయంలోకి వెళ్లి సమావేశమందిరంలో సీఎం, మంత్రి ఫొటో లు అమర్చారు. అయితే ఆ సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ఉద్రిక్తత చోటుచేసుకోలేదు. ఆ తర్వాత ఆ ఫొటోలను బీఆర్‌ఎస్ నాయకులు తొలగించారు. దీనిపై కూడా కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందని మార్కెట్ చైర్మన్ ప్రకటించారు. ప్రొటోకాల్ ప్రకా రం సీఎం, మంత్రి ఫొటోలు ఉండాల్సిందేనని కాంగ్రెస్ నాయకులు చెబుతుండగా, ఏదేమైనా ఫొటోల విషయమై అధికారులకు ఫిర్యాదు చేసి ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. ఆక్రమంగా క్యాంప్ కార్యాలయంలోకి ప్రవేశించే హక్కు వారికి ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోనే భిన్నం...

సూర్యాపేట నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. 2014 నుంచి 2023 వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎన్నికవుతూ వస్తున్నారు. అంతేకాకుండా మొదట్లో విద్యాశాఖ మంత్రిగా, ఆ తర్వాత విద్యుత్ శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు. దాదాపు 9 ఏళ్ల మంత్రిగా వ్యవహరించారు. 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా జగదీష్‌రెడ్డి మూడోసారి గెలిచినప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ నాయకులెవరూ గెలవలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సూర్యాపేటలో మాత్రమే రాజకీయంగా భిన్న పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, స్థానికంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొనసాగుతుండటం రాజకీయంగా నిత్యం వేడిపుట్టిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఏఐసీసీ కార్యదర్శి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నీ తానై నియోజకవర్గంలో ప్రతీ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఆయన సూర్యాపేటలో ఉంటే చిన్నా, పెద్ద...

- మిగతా 8వ పేజీలో...



సూర్యాపేటలో బతుకమ్మల కోసం పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు, స్థానికులు

నేడు ఎంగిలిపువ్వు బతుకమ్మ

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):అత్యంత వైభవంగా నిర్వహించే ఎంగిలి పువ్వు బతుకమ్మ పండుగ కోసం సూర్యాపేట ముస్తాబవుతోంది. జిల్లాకేంద్రంలోని సద్దుల చెరువు, రైతుబజార్‌తో పాటు పలుప్రాంతాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు అధికారులు పూర్తి చేస్తున్నారు. సద్దులచెరువు కట్టపై లైటింగ్ ఏర్పాటుచేసినట్లు మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి తెలిపారు. చెరువులోకి దిగకుండా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

బతుకమ్మ,బతుకమ్మ ఉయ్యాలో వివరాలు 6లో

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. బతుకమ్మ ఉత్సవాలతో పాటు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. గతేడాది చీరలు ఇస్తున్నామని ఆశపెట్టి మహిళల ఆశలు ఆవిరి చేశారని, ఈఏడాదైనా ఇస్తారో లేదో అన్నారు.

\- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

నేడు జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటన



హుజూర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం హుజూర్‌నగర్‌లో పర్యటించనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల, ఫణిగిరి గట్టు వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ కాలనీ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష చేయనున్నారు. అలాగే ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ట్రైసైకిళ్లు పంపిణీ చేయనున్నారు. మోడల్ కాలనీ, ఏటీసీ, ఐటీఐ, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రగతి పనులపై సమీక్ష చేసిన అనంతరం తిరిగి సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని పర్యాటక అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతికర్ణాకర్, తండు శ్రీనివాస్, వల్దాసు దేవేందర్, కుంభం అంజయ్య పాల్గొన్నారు.

హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ జిల్లా కొత్త కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్.పద్మ, కార్యదర్శిగా రాంబాబు, కోశాధికారిగా సాయిరాములుతో పాటు మరికొందరు సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఎల్లప్పుడూ నిబద్ధ తతో పని చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జానిమియా, దున్న శ్యాం, సైదులు, పద్మ, రాం బాబు, సాయిరాములు, వంగపల్లి పద్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

సూర్యాపేటఅర్బన్,సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థులకు ఆధార్ కార్డుల సవరణ కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ అప్‌డేట్ లేని విద్యార్థులు, నూతన కార్డులు, మార్పులు, చేర్పులు చేయాల్సిన వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని మండల కేంద్రంలోని విద్యవనరుల కేంద్రాలల్లో, ఎస్ఎన్ఆర్ ఆధార్ ఏజెన్సీ వారు శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలో 23కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, దసరా సెలవుల్లో విద్యార్థులు ఆధార్ సవరణలు పూర్తి చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టా అందజేస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్

కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల్లో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో కలెక్టర్ పాల్గొని విద్యార్థినులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు అందజేసి, మాట్లాడారు. నేటి సాంకేతిక కృత్రిమ మేధస్సు యుగంలో స్వతంత్ర ఆలోచనలతో భవిష్యత్‌లో ఏమి అవ్వాలో ఆలోచిస్తూ పట్టుదలతో కృషి చేసి ముందుకు సాగాలన్నారు. పదో తరగతి నుం చి డిగ్రీ వరకు చాలా క్లిష్టమైన పరిస్థితులు విద్యార్థుల కు ఉంటాయన్నారు. జీవితంలో ముఖ్యమైన అంశాల ను నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధపెట్టి ఏ సబ్జెక్ట్‌పై ఆసక్తి ఉంటుందో ఆ సబ్జెక్ట్‌పై నైపుణ్యాలు పెం పొందించడం ద్వారా ఉపాధి కల్పన అవకాశాలు దొరుకుతాయన్నారు. పదో తరగతి వరకు బయటి ప్రపంచంతో అంతగా సంబంధం ఉండదని, కళాశాల్లో చేరిన తర్వాత నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల్లో 95శాతం ఉత్తీర్ణత రావడం, గ్రాడ్యుయేట్ పూర్తైన అందరికి మంచి ఇంజనీరింగ్ కళాశాల్లో ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్లు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం సీతారాం, ప్రిన్సిపాల్ సుజాత, హెచ్‌వోడీలు బీబీరావు, రాజేశ్వర్‌రావు, అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నందికి అభిషేకం

సూర్యాపేటరూరల్ : త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ దంపతులు పిల్లలమర్రి శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి నందీశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ దంపతులను ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ చైర్మన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి, భక్తులు, పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా పని చేయాలి

ఎస్పీ కొత్తపల్లి నర్సింహ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా పని చేయాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ పోలీస్ అధికారులకు సూచించారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో శనివారం అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన పోలీసుల నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రజలతో సమీపంగా ఉంటూ నేరాలను కట్టడి చేస్తూ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. నమోదు చేసే కేసుల్లో నేరస్తులకు శిక్షలు అమలయ్యే విధంగా నాణ్యమైన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణపై పోలీస్ స్టేషన్‌లోని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. కేసుల దర్యాప్తులో స్టాండర్డ్ ఆపరేటర్ ప్రొసీడర్ పాటించాలన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. డయల్-100 కాల్స్‌కు వెంటనే స్పందించి బాధితులకు సాయం చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో వ్యక్తి జీవనశైలిపై సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోయిందన్నారు. ఇతరుల మనోభావాలు కించపరిచే విధంగా సమాచారం సోషల్ మీడియాలో వ్యాప్తి చేయడం చట్టరీత్యానేరమని అలాంటి వారిపై ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు కించపరిచే విధంగా సమాచార చిత్రాలు, వీడియోలు ప్రచారం చేస్తున్నట్లు ఇటీవల ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మెరిటోరియస్ సర్వీస్ రివార్డ్స్

జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్‌లో గల శ్రీసాయి సంతోషి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసులో చోరీకి గురైన బంగారు ఆభరణాలను రికవరీ చేయడంలో బాగా పని చేసిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యకు అత్యుత్తమ మెరిటోరియస్ సర్వీస్ రివార్డును అందజేశారు. అదే విధంగా కేసుల నిర్వహణ, త్వరగా కేసుల పరిశోధన చేసినందుకు కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ కె. శివశంకర్, నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్, చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డికి రివార్డులు అందజేశారు. నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నేరస్తుడికి కోర్టులో ఇటీవల ఇరవై ఏళ్ల జైలు శిక్ష పడడంలో బాగా పని చేసిన నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీకాంత్, కానిస్టేబుళ్ల నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లుకు రివార్డులు అందించినట్లు తెలిపారు. సమావేశంలో సూర్యాపేట, కోదాడ డీఎస్పీలు ప్రసన్నకుమార్, మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌బీఐ రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబుతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్టు-30 అమలు : ఎస్పీ

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు-30 ఈనెల 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని ఎస్పీ కొత్తపల్లి నర్సింహశనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, సభలు, ఊరేగింపులు, ధర్నాలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల జీవనానికి ఇబ్బందులు కలిగించేందుకు దారి తీసే సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని వివరించారు.. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు, డీజేలకు నిషేధమన్నారు. పోలీస్ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలకు గురవుతారని పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులను నిలిపివేయాలి



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

పెన్‌పహాడ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :అక్రమ అరెస్టులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. మండలంలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఎల్లావుల జగన్, బీఆర్‌ఎస్ కార్యకర్త పర్వతం నాగయ్యను తెల్లవారుజామున పోలీసులు ఇళ్లలోకి వచ్చి అరెస్టు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ మాట్లాడుతూ... పెన్‌పహాడ్ ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయన ఆరోపించారు.

అందరూ సమానమే : గోపికృష్ణ, ఎస్ఐ.

ఈవిషయమై ఎస్ఐ గోపికృష్ణను వివరణ కోరగా తనకు ఎవరిపై కక్షసాధింపు లేదన్నారు.యుగేందర్ తన ఫోన్‌లో వాట్సప్ స్టేటస్‌లో రాజకీయ పరమైన వివాదాస్పదమైన వీడియోలు పెట్టడంతో దోసపహాడ్ గ్రామంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఘర్షణ అవకాశంఉండడంతో ముందస్తు సమాచారంతో శాంతిభద్రతలను కాపాడం కోసం యగేందర్, జగన్, నాగయ్యలను ఆ గ్రామంనుంచి తప్పించి, పోలీస్ స్టేషన్‌లో కొద్దిసేపు ఉంచి పంపినట్లు చెప్పారు. స్టేషన్ నుంచి పంపిన తర్వాత మళ్లీ స్టేషన్ వద్ద ఆందోళనచేయడం సరికాదన్నారు కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగేశ్వర్‌రావు, బొల్లక సైదమ్మ బొబ్బయ్య, చిట్టెపు నారాయణ రెడ్డి, మేకల శ్రీనివాస్, నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, జడ వీరయ్య, చెన్ను ప్రభాకర్ రెడ్డి, కొండేటి వెంకట్ రెడ్డి, మామిడి సతీష్, వీరబోయిన సైదులు, అప్పారావు, లింగయ్య పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం చండీఘడ్‌లో ఈనెల 21నుంచి 25వరకు నిర్వహించనున్న సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో శనివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందన్నారు. ఈడీ, సీబీఐ సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తూ సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు దిగజార్చే విధంగా పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కంబాల శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రాము, చామల అశోక్‌కుమార్, ఎండీ పాషా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎండీ ఉమర్

కోదాడటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మొదటి శ్రేణి జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ ఎండీ ఉమర్ అన్నారు. స్థానిక కే ఆర్ఆర్ ప్రభుత్వ, జూనియర్ కళాశాల కోదాడలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గిరిజనులకు హక్కులను గురించి తెలుపుతూ పలు న్యాయపరమైన సూచనలను, ఉచిత న్యాయపరమైన సలహాలను చేశారు. ఎదుటి వారి జీవితంలోకి ఎప్పుడు వెళ్లవద్దని మీ గురించి మాత్రమే మీరు ఆలోచించండి.. అని అన్నారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా ఇతరసమస్యలు ఉన్న న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగిన న్యాయాన్ని పొందవచ్చునని, చైల్డ్ యాక్ట్, ఫోక్సో యాక్ట్, లీగల్ సర్వీసెస్ యాక్ట్ గురించి సంపూర్ణంగా ఆయన వివరించారు. ట్రైబల్ ఏరియాలో జీవో, ఎంఎస్ నెంబర్ 57 ఆధారంగా గిరిజనులకు ప్రత్యేక కోడ్స్ ఉంటాయన్నారు. విద్యార్థులు కానీ యువకులు కాని అవసరమైన విషయాలలో కోర్టు మెట్లు ఎక్కొద్దన్నారు. కళాశాలలో విద్యార్థులు అమ్మాయిలను వేధిస్తే కేసులు అవుతాయని చదువు పట్లనే శ్రద్ధ పెట్టి సెలవుల్లో కూడా అధ్యయనం చేయాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఆయన అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి న్యాయ విజ్ఞాన సదస్సులు కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థులు అవగాణతోపాటు క్రమ శిక్షణ ఏర్పడుతుందని ఇలాంటి చైతన్య సదస్సులను ఇక్కడ ఏర్పాటుచేసినందుకు సంతోషిస్తున్నామని అన్నారు. అనంతరం జడ్జి ఎండీ ఉమర్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ముగింపు పలుకులు అధ్యాపకులు ఆర్ పిచ్చిరెడ్డిపలుకగా కార్యక్రమంలో చిత్తలూరి సత్యనారాయణ వేముల వెంకటేశ్వర్లు, సామాజికకార్యకర్త మాలోతు సైదానాయక్, న్యాయవాదులు ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు, రామిశెట్టి రామకృష్ణ, నరసింహారావు, హేమలత, దొడ్డ శ్రీధర్, మండల లీగల్ సర్వీస్ అథారిటీస్ మెంబర్స్ మౌనికశైలజ, జె. సైదమ్మ, ఎండి మజహర్, దార యేసోబులతో పాటు అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రాంతంలో జానపద సాంప్రదాయంలో జరుపుకునే నవరాత్రి ఉత్సవాల్లో బతుకమ్మ పండుగది ముఖ్యభూమిక. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి మొదలుకుని నవమి వరకు ప్రతి పల్లె, పట్టణాల్లో బతుకమ్మ సందడి నెలకొంటుంది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలకు బతుకమ్మ నిలువుటద్దం. మహిళలకు ఇష్టమైన పూలపండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకునేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. నేడు ఎంగిలిపువ్వు బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో

- తొమ్మిది రోజుల పాటు వేడుకలు
- నేడు ఎంగిలిపువ్వు బతుకమ్మ
- పూలతో నిండిన మార్కెట్లు

జానపదుల ఇలవేల్పు అయిన బతుకమ్మను ముగ్గురమ్మల మూలపుటమ్మగా భావిస్తారు. బతుకమ్మ సంబురానికి సన్నిహిత సంబంధం ఉందని చెప్పే ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి. ధర్మాంగుడనే రాజు ఆయన భార్య సత్యవతికి 100 మంది పుత్ర సంతానం కలిగి చనిపోతారు. ఆ దంపతులు లక్ష్మీదేవిని వేడుకుంటే ఆ ఇంట ఆడపిలగా పట్టిందని ప్రచారం. పుట్టిన ఆ శిశువును చిరంజీవిగా కలకాలం జీవించాలని ఆశీర్వదిస్తూ బతుకు+అమ్మ=బతుకమ్మ అని పేరు పెట్టి కొలుస్తున్నట్లు ఓ కథ విశేషంగా ప్రచారంలో ఉంది. మహిషాశురుడిని సంహరించి కర్తవ్యాన్ని నిర్వహించిన దుర్గాదేవి ప్రజలకు కొత్త జీవితాన్ని, బతుకును ప్రసాదించింది. బతుకునిచ్చిన బతుకమ్మ కాబట్టి గ్రామీణులు ఆమెను బతుకమ్మగా పిలుస్తున్నారు. దక్ష ప్రజాపతి వల్ల అవమానం పొందిన సతీదేవి అగ్నికి ఆహుతి అయితే శివుడు అగ్రరూపుడై దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేశాడు. యజ్ఞ గుండంలో పడి భస్మీపటలమైన సతీదేవి ప్రతీకగా పసుపు గౌరమ్మను సృష్టించారు. ఆమె బతికి బతుకునిచ్చే తల్లి కాబట్టి సతీదేవే బతుకమ్మ అయిందని మరో కథనం. చోళరాజు, ధర్మాంగుడు, సత్యవతి దంపతులకు కారణజన్ములైన అంశం కూడా పురాణాల్లో ఉంది. 12వ శతాబ్దం నుంచి బతుకమ్మ పాటలు నానుడిలోకి వచ్చాయంటారు. కాకతీయుల కాలంలో రుద్రమదేవి ఓరుగల్లు రాజ్యానికి ఒక స్త్రీ రాణిగా ఉండడాన్ని సహించని సామంతరాజులు పథకం పన్నిన నేపథ్యంలో రుద్రమదేవికి సహకరిస్తూ ఒక స్త్రీ ఆయుద్ధంలో వీరమరణం పొందింది. అందుకు గుర్తుగా రుద్రమదేవి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించినట్లు కూడా కథనం ఉంది. ప్రకృతిని పూజించి పరిరక్షించటం, ప్రేమను పంచటం అన్న ఆత్మీయ సందేశాన్ని బతుకమ్మ మనకు అందిస్తుంది.





పూలకు డిమాండ్

బతుకమ్మ పండుగల్లో మొదటిరోజున నిర్వహించే ఎంగిలిపువ్వు బతుకమ్మను పేర్చేందుకు మహిళలు భారీ సంఖ్యలో పూలను కొనుగోలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పూలు భారీ ఎత్తున కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారు. పూలకు డిమాండ్ ఉండడంతో వ్యాపారస్తులు 50 గ్రాములకు రూ.70 చొప్పున విక్రయించారు. బంతిపూలు, చామంతిపూలు, వివిధ రకాల బంతి పూలు పట్టణమంతా వివిధ ముఖ్య ప్రాంతాల్లో కుప్పలుగా పోయడంతో మార్కెట్లు, పట్టణమంతా పూలమయంగా మారింది.

తీర్చిదిద్దడమూ కళే..

బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దటంలో మహిళలు పోటీపడుతుంటారు. ముందుగా పళ్లెంలో గుమ్మడిపూలను పర్చి వాటిపై తంగేడు, గడ్డిపువ్వు, గునుగు, రుద్రాక్ష, బీర, జిల్లేడు, కట్లపువ్వులు, గన్నేరు, బంతి, సొర, గోరింట, నాచు, వంటి పుష్పాలను క్రమపద్ధతిలో అమర్చుతారు. ఆ పూలరాశిపై తమలపాకులో పసుపుతో తయారుచేసిన గౌరమ్మను ఉంచుతారు. పుష్ప సౌందర్యంతో శోభిల్లే ఈ సముదాయాన్ని బతుకమ్మగా వ్యవహరిస్తారు.

సామూహికం, రాగయుక్తం

బతుకమ్మలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి ఒక చోట పెట్టి, వాటి చుట్టూ తిరుగుతూ సామూహికంగా, లయబద్ధంగా పాటలు పాడుతూ ఉల్లాసంగా గడుపుతారు. ఒకరు పాటలు చెబుతుంటే మిగిలినవారు రాగయుక్తంగా పాడుకుంటారు. ఒక్కొక్క పువ్వేసి చందమామ.. బంగారు బతుకమ్మ చందమామ అంటూ అడుగులు వేస్తుంటారు. బతుకమ్మ, గౌరమ్మలను కీర్తిస్తూ, అనేక సందర్భాల్లో ఘటనలకు అనుగుణంగా పాటలు కట్టి పాడుతుంటారు. రామాయణం, మహాభారతాలతో పాటు తెలంగాణ పాటలను పాడతారు. ఆటపాటల అనంతరం బతుకమ్మలను తమ సమీపంలోని కాల్వలు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.



రోజుకో పేరుతో..

పెత్రమావాస్య నుంచి నవమి వరకు తొమ్మిది రోజుల పాటు మహిళలు రకరకాల పూలతో బతుకమ్మలను అలంకరించి పూజిస్తారు. బతుకమ్మలను ఆడిన తర్వాత ప్రసాదాన్ని పంపిణీ చేస్తారు.

రోజుకో	పేరున
మొదటి రోజున	ఎంగిలిపువ్వు
రెండవ రోజున	అటుకుల
మూడో రోజున	ముద్దపప్పు
నాలుగో రోజున	నాన బియ్యం
ఐదో రోజున	అట్ల
ఆరో రోజున	అలిగిన
ఏడో రోజున	వేపకాయ
ఎనిమిదో రోజున	వెన్నముద్దల
9వ రోజున	సద్దుల బతుకమ్మ

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

విశిష్టం అమ్మవారి ఉత్సవం

● తొమ్మిదిరోజుల పాటు బస్తీ మొత్తం మద్యం, మాంసానికి దూరం ● బస్తీని మెప్పించిన యువత ● అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యాకే అసలైన దసరా

అమ్మవారి నవరాత్రోత్సవాలు అంటే ఎవరికైనా స్ఫురించేవి విగ్రహ ప్రతిష్ఠ, పూజలు, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ఘనంగా నిమజ్జన శోభాయాత్ర. కొద్ది మంది యువత అమ్మవారి మాలధారణ చేస్తుండగా కొందరు మాత్రమే నియమాలు పాటిస్తారు. కానీ యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలోని రాజేంద్రనగర్(జంఖనాగూడ) ఇందుకు భిన్నం. మండపంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఇంటి దేవతగా పరిగణిస్తూ తొమ్మిది రోజుల పాటు బస్తీ వాసులందరూ భక్తి నియమాలు పాటించడం, మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. దసరాను కూడా కేవలం మిఠాయిలతోనే జరుపుకోవడం ఈ బస్తీ ప్రత్యేకత.

1977లో ఈ బస్తీలో సోమేశ్వర భక్తభజన మండలి ఏర్పాటైంది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా వినాయక నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే దేవి నవరాత్రి ఉత్సవాల విశిష్టతను తెలుసుకున్న ఆ బస్తీ యువత గతేడాది అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రి వేడుకలను నిర్వహించాలని సంకల్పించారు. కానీ యువత ప్రయత్నాలను బస్తీలోని పలువురు అడ్డుకునేందుకు యత్నించారు. వేడుకలను నిష్ఠగా నిర్వహించాలని, భక్తి నియమాలు విస్మరిస్తే బస్తీకే చేటు జరుగుతుందని హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది యువత అమ్మవారి దీక్షను స్వీకరించి ఉత్సవాలను ప్రారంభించారు. వారికి మరికొందరు యువత అండగా నిలిచారు. నిష్ఠ, నియమాలతో వేడుకలను నిర్వహిస్తామని, అపచారానికి అవకాశం ఇవ్వమని బస్తీవాసులకు నచ్చజెప్పారు. దీంతో యువతలో వచ్చిన మార్పు, పట్టుదల, నవరాత్రి వేడుకల నిర్వహణకు పాటిస్తున్న కఠిన నియమాలను చూసిన బస్తీవాసులు తాము కూడా దీక్ష చేయాలని సంకల్పించారు. ఈ మేరకు గతేడాది బస్తీవాసులు మద్యం, మాంసం, ఇతర దురలవాట్లకు దూరంగా ఉన్నారు. ఇదే తంతును ఈ ఏడాది వేడుకలలో పాటించేందుకు రాజేంద్రనగర్ వాసులు సిద్ధమవుతున్నారు.



రాజేంద్రనగర్‌లో అమ్మవారి మండపం

అక్టోబరు 5న దసరా

బస్తీలో పలు సామాజికవర్గాలకు చెందిన సుమారు 100 ఇళ్లలో 150కి పైగా ఉన్న కుటుంబాలలో సుమారు 500 మంది వరకు నివసిస్తున్నారు. వీరిలో నిత్య వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, పేదలే అధికం.అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యే వరకు బస్తీవాసులు మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. అయితే అక్టోబరు 3న నిమజ్జనంతో ఉత్సవాలు ముగుస్తాయి. కానీ మధ్యలో 2న వచ్చే దసరాను మిఠాయిలతో జరుపుకుని 5న(ఆదివారము) అసలైన దసరా సంబురాలను జరుపుకునేందుకు రాజేంద్రనగర్ వాసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు బస్తీ వాట్సాప్ గ్రూపుల్లో సమాచారాన్ని పంచుకున్నారు.

ఈ ఏడాది కూడా అదే కట్టుబాటుతో..



దేవీనవరాత్రోత్సవాల నిర్వహణకు బస్తీ యువత గతేడాది సిద్ధమయ్యారు. నియమ, నిష్ఠలతో చేయాల్సి ఉంటుందని కాబట్టి వారించే ప్రయత్నాలు చేశాం. ఉత్సవ నిర్వహణలో యువత చూపిన చిత్తశుద్ధితో బస్తీ వాసులందరం గతేడాది నవరాత్రుల పాటు మద్యం, మాంసం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని కట్టుబాటు చేసుకున్నాం. ఈ ఏడాది కూడా అదే కట్టుబాటులో ఉంటూ దసరాను అక్టోబరు 2 బదులు 5న పండుగ సంబురాలు చేసుకుంటాం.

ఇట్టబోయిన గోపాల్, రాజేంద్రనగర్.

మాలో మార్పు వచ్చింది



మా బస్తీలో భిన్న సామాజిక వర్గాలకు చెందిన వారే అధికం. ఈ నేపథ్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను నిష్ఠగా నిర్వహిస్తే యువతలో మార్పు వస్తుందని సోమేశ్వర భక్తభజన మండలి సభ్యులం భావించాం. ఆ లక్ష్యంతో గతేడాది ప్రారంభించిన ఉత్సవాలతో బస్తీ అంతా ఈ ఏడాది కూడా నిష్ఠలోకి వెళ్తుంటడం సంతోషంగా ఉంది.

భాను ప్రసాద్, ఉత్సవాల నిర్వాహకుడు

నిష్ఠ మా బస్తీ ప్రత్యేకత



దేవీనవరాత్రుల పాటు నిష్ఠగా ఉండటం మా బస్తీ ప్రత్యేకత. ఆ 9రోజుల పాటు అన్ని ఇళ్లలో మద్యం, మాంసం వాడరు. అందరికి భిన్నంగా దసరాను కూడా మిఠాయిలతోనే జరుపుకుంటాం. అమ్మవారిని ప్రతి రోజూ విశేషరీతిలో అలంకరిస్తాం. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. బస్తీ వాసులందరూ ఉత్సాహంగా పాల్గొంటారు.

బీరకాయల సుధ, రాజేంద్రనగర్.

గొడకొండ్లలో 15 ఏళ్లుగా..



గొడకొండ్ల గ్రామంలో అమ్మవారి దీక్ష తీసుకున్న గ్రామస్థులు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ఆధునిక పోకడలు ఉన్న యువత నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో ఆధ్యాత్మిక బాటలో పయనిస్తోంది. చేతిలో సెల్‌ఫోన్, సరదాలు, షికార్లు కోరుకునే వారు అందుకు భిన్నంగా దేవీనవరాత్రోత్సవాలను మాత్రం క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారు. చింతపల్లి మండలం గొడకొండ్ల, పోలేపల్లిరాంనగర్, తక్కళ్లపల్లి, ఉమ్మాపురం, చాకలిశేరుపల్లి, అంగడి కుర్మపల్లి, ఎం.మల్లేపల్లి, సాయిరెడ్డిగూడెం, చింతపల్లిలోని యువకులు దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటుచేసి తొమ్మిది రోజుల పాటు దీక్ష తీసుకుంటున్నారు. గొడకొండ్ల గ్రామంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వల్లపు శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా గ్రామ రచ్చబండ వద్ద దేవీనవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ వర్ణాల చీరలను, ప్రసాదాలను, పూలదండలతో పాటు చండీహోమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ తొమ్మిదిరోజుల పాటు గ్రామాలు ప్రత్యేకపూజలతో పాటు భజనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి.

అదృష్టంగా భావిస్తున్నాం



గ్రామంలో దుర్గామాతాను 15 ఏళ్లుగా ప్రతిష్ఠిస్తున్నాం. భక్తితో అమ్మవారి దీక్షా తీసుకోని పూజలు చేస్తున్నాం. నాతో పాటు కమిటీ సభ్యులకు 15 మంది దీక్ష తీసుకుంటారు. దీక్షతో మానసిక ఉల్లాసంతో పాటు ప్రశాంతమైన జీవితాన్ని పొందుతున్నాం. గ్రామస్థుల సహకారంతో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం.

వల్లపు శ్రవణ్, కమిటీ అధ్యక్షుడు, గొడకొండ్ల

మాడవీధుల్లో స్వర్ణరథంలో అమ్మవారు



దేవరకొండలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటుచేసిన స్వర్ణరథం



(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

నల్లగొండ జిల్లా దేవరకొండలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని స్వర్ణరథంలో ఊరేగించేందుకు ఏర్పాట్లుపూర్తయ్యాయి. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన స్వర్ణరథం రాష్ట్రంలోనే మొదటి. ఈ ఆలయంలో వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు ఈ ఏడాది నుంచి స్వర్ణరథం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.

దేవరకొండలో 1984లో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని నిర్మించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏటా వినాయక, దేవీనవరాత్రోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఈ పర్యాయం వేడుకలకు ఆలయం ముస్తాబైంది. ఇప్పటికే పురవీధుల్లో ఆర్చీలు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇటీవల ఏర్పాటుచేసిన స్వర్ణరథంలో అమ్మవారిని ప్రతిరోజూ దేవాలయ మాడవీధుల్లో ఊరేగించనున్నారు. అదేవిధంగా అక్టోబరు 4న అమ్మవారి శోభాయాత్ర కన్నులపండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. అదేవిధంగా దాతల సహకారంతో అమ్మవారికి 102 గ్రాలతో బంగారు హారం, స్వర్ణకిరీటం తయారుచేయించారు. ఈ ఉత్సవాలకు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుంటారు.

మొక్కులు తీర్చే దైవం వాసవీమాత



కోరిన కోరికలు నెరవేర్చే దైవం వాసవిమాత. దేవరకొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. తొమ్మిది రోజులపాటు శరన్నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశాం. దేవాలయ కమిటీ ఐక్యంగా దేవాలయ అభివృద్ధితోపాటు దాతల సహకారంతో భక్తిశ్రద్ధలతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. స్వర్ణరథంలో మాడవీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తాం.

చీదెళ్ల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్యసంఘం పట్టణ అధ్యక్షుడు

కనకదుర్గాకాలనీగా పిలుచునేలా....

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



నార్కట్‌పల్లిలోని 13వ వార్డులో దుర్గామాత మండపం

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో 13ఏళ్లుగా దుర్గామాత ఉత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. ఓ నలుగురు భక్తులకు వచ్చిన ఆలోచన 15 మంది సభ్యులుగా ఏర్పడి 2012లో మొదలైన దుర్గామాత ఉత్సవాలకు నాందిపలికారు. 13వ వార్డులో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంతో కాలనీకి కనకదుర్గాకాలనీగా పిలుచుకునేలా చేసింది. తొలుత ఓ చిన్నస్థలంలో మండపంలో దుర్గామాత ప్రతిమను పెట్టి పూజలు చేసేవారు. తర్వాత ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో వేదికతో పాటు పక్కా(షెడ్డు) మంటపాన్ని నిర్మించారు. ప్రతి ఏడూ చండీహోమాన్ని నిర్వహిస్తూ అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. ఉత్సవ పూజలు ముగిసే వరకు కమిటీ సభ్యులు దీక్షాకంకణ బద్ధులై వ్యవహరిస్తారు.

గుండెపోటుతో తెలంగాణ ఉద్యమకారుడు మృతి



యాదగిరి(ఫైల్)

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మట్టిపల్లి యాదగిరి(40) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. గుండెనొప్పితో బాధపడుతున్న అతడిని ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నార్కట్‌పల్లిలో చురుకైన ఉద్యమకారుడిగా యాదగిరి పనిచేశాడు. పోలీసుల కేసులు, లాఠీ దెబ్బలకు వెరవకుండా ప్రత్యేక పోరులో తన గళాన్ని యాదగిరి ధైర్యంగా విప్పారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా స్థానిక నల్లగొండ చౌరస్తా వద్ద హైమాస్ట్ లైట్ టవర్‌ను ఎక్కి తన నిరసనను తెలిపారు. యాదగిరికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా యాదగిరి మృతికి పలువురు నాయకులు, తెలంగాణా ఉద్యమకారులు సంతాపం తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

తుర్కపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపూర్‌లో కుటుంబకలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ తక్యుద్దీన్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నలక్ష్మాపూర్ గ్రామానికి చెందిన దూబల నర్సింహారెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి(40) 12 ఏళ్ల కిందట బొమ్మల రామారం మండలం ప్యారారం గ్రామానికి చెందిన చిమ్ముల లక్ష్మారెడ్డి కుమార్తె లహరితో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కమారుడు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య లహరి శనివారం తెల్లవారు జామున వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా శ్రీకాంత్‌రెడ్డి చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదుమేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుషాయిగూడలో వివాహిత దారుణహత్య

● అనుమానంతో భార్యను హతమార్చిన భర్త



భార్యను హత్యచేసి పారిపోతున్న శంకర్, మంజుల(ఫైల్)

ఏఎస్‌రావునగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుషాయిగూడలో వివాహిత దారుణహత్యకు గురైంది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త కత్తితో దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందింది. అణుపురం కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడురుకు చెందిన బోడ శంకర్(40)కు ఇదే ప్రాంతం గోవిందాపురానికి చెందిన మంజుల(35)తో 20ఏళ్ల క్రితం వివాహమైంది. శంకర్‌కు ఇది రెండో వివాహం. అనంతరం జీవనోపాధి కోసం ముంబయికి భార్యను తీసుకొని శంకర్ వలసవెళ్లాడు. మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగించారు. వీరికి కేవిన్, ప్రిన్స్ కుమారులున్నారు. కొన్నేళ్లపాటు దాంపత్య జీవితం సజావుగా సాగింది. భార్య ప్రవర్తనపై అనుమానంతో నిత్యం గొడవపడుతున్నాడు. శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. రోజురోజుకూ వేధింపులు ఎక్కువై పోవడంతో ఈ నెల 14న ఏఎస్‌రావునగర్ అణుపురంలో నివాసముండే అక్కాబావలు రాణి, మల్లేష్ వద్దకు చిన్న కుమారుడిని తీసుకుని మంజుల వచ్చింది. ఇక భర్తతో ఉండలేనని, తనను ఎప్పుడో చంపేస్తాడని వారితో పాటు బంధువుల వద్ద వాపోయింది. ఆ తర్వాత శంకర్ కూడా ఇదేరోజు ఇక్కడికి వచ్చాడు. ఇద్దరికీ సర్దిచెప్పారు. అలాగే శంకర్ కూడా సమీపంలో ఉంటున్న బంధువులను సంప్రదించి మంజులను మంచిగా చూసుకుంటానని నమ్మించాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగిన శంకర్ మళ్లీ మంజులతో గొడవపడ్డాడు. అర్ధరాత్రి వంటింట్లో నిద్రిస్తున్న సమయంలో కత్తితో భార్య మెడపై పొడిచి బయట నుంచి తలుపులకు వేసి పారిపోయాడు. ఆమె అరుపులు విన్న కుటుంబీకులు ఆమె సోదరుడు భిక్షపతికి సమాచారం అందించారు. స్థానికులు కూడా ఈ విషయమై పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందగా ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీలో నిందితుడిని పారిపోవడాన్ని గమనించారు. త్వరలోనే పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఎల్.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రెండు మృతదేహాలు లభ్యం

● ఒకరు చిన్నేటి వాగులో గల్లంతు ● మరొకరు బీబీనగర్ చెరువులో ఆత్మహత్య



గుండు నరేష్, సురేందర్(ఫైల్‌ఫొటోలు)

బీబీనగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో శనివారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకరు చిన్నేటివాగులో గురువారం గల్లంతు కాగా, మరొకరు శుక్రవారం ఉదయం బీబీనగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం గూడూరు శివారులో చిన్నేటివాగులో గల్లంతైన గండు నరేశ్ (23) మృత దేహం శనివారం పోలీసులకు లభ్యమైంది. హైదరాబాద్‌లోని నాంచారంలోని బాబానగర్‌కు చెందిన గండు నరేశ్ గురువారం మిత్రుడు సంతోష్‌తో కలిసి బీబీనగర్‌కు వచ్చి చిన్నేటి వాగు ప్రవాహాన్ని దాటే ప్రయత్నంలో గల్లంతైన విషయం విదితమే. అప్పటి నుంచి మృతదేహం కోసం ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం బీబీనగర్ మండలంలోని అన్నంపట్ల గ్రామ శివారులో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు.

● కాగా, హైదరాబాద్‌లోని రామంతాపూర్ ప్రగతినగర్‌లో నివాసం ఉండే బర్ల సురేందర్(36) శుక్రవారం ఉదయం బీబీనగర్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం అతడి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించడంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది వెలికి తీశారు. రెండు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగుతోందని సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



నాగార్జునసాగర్ 24 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

కృష్ణమ్మ సవ్వడి

● సాగర్ 24 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 24 క్రస్ట్ గేట్ల ద్వారా శనివారం కూడా నీటి విడుదల కొనసాగింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 587.20 అడుగులుగా (305.6242టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 9,076 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,211 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లల్లో 24 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 1,87,344 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,41,831 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,41,831 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

కేతేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు నాలుగు క్రస్టుగేట్లతో వరద నీటి విడుదల కొనసాగుతుంది. వారంరోజులుగా హైదరాబాద్ నగరంతోపాటు మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు చేరుతుంది. దీంతో వారం రోజుల నుంచి మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. శనివారం సాయంత్రానికి ఎగువనుంచి 6791.62క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టు 2, 3, 4, 7, 10వ నెంబరు క్రస్టుగేట్లను ఒక్కోటి రెండు అడుగుల మేర ఎత్తి 7153.60 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడం, ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు అధికారులు ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ఎప్పటికప్పుడు క్రస్టుగేట్ల నిర్వహణను పెంచడం, తగ్గించడం చేస్తున్నారు. 645 అడుగుల(4.46 టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.60అడుగులు(4.09టీఎంసీ)లుగా ఉంది. మరోవైపు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 624.78క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. .

మురుగునీరు వెళ్లేదెలా?

● యాదగిరి కొండచుట్టూ వాన నీటి కాల్వ అస్తవ్యస్తం ● పేరుకుపోయిన చెత్తాచెదారం ● వర్షం వస్తే పట్టణంలో వరదే!





మట్టితో మూసుకుపోయిన డ్రైనేజీ, నిలిచిన మురుగునీరు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆధ్యాత్మికక్షేత్రంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ దేవస్థానం ఖ్యాతిగడించింది. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండచుట్టూ రింగ్ రోడ్డు నిర్మించి వర్షం నీరు (స్టాం వాటర్ డ్రైన్), మురుగు నీటికి వేర్వేరుగా డ్రైనేజీ కూడా నిర్మించారు. కానీ, భక్తులు వినియోగించే నీరు, వర్షపు నీరు సౌకర్యవంతంగా దిగువ ప్రాంతానికి తరలించేందుకు వైటీడీఏ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వేర్వేరుగా అండర్ డ్రైనేజీ, స్టాం వాటర్ డ్రైన్‌ను నిర్మించింది. అయినా కొన్నిచోట్ల కాల్వలో నిలిచిన వర్షం నీరు పట్టణ వీధుల వెంట ప్రవహిస్తోంది. పర్యవేక్షణ కొరవడి డ్రైన్‌లో నీళ్లు ఎక్కడ నిలిచాయో గుర్తించేందుకు చొరవ చూపడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

రూ.13కోట్లతో ఐదు కిలోమీటర్ల మేర

కొండచుట్టూ సుమారు ఐదు కిలోమీటర్ల పైచిలుకు రింగ్ రోడ్డుకు ఇరువైపుల సుమారు రూ. 13కోట్లతో 3/3ఫీట్ల వెడల్పు, లోతున డ్రైనేజీ నిర్మించారు. మొదటి ఘాట్ రోడ్డు నుంచి ప్రస్తుతం బ్రిడ్జి పనులు సాగుతున్న ప్రదేశం వరకు డ్రైనేజీ పూర్తిగా మట్టితో మూసుకుపోయింది. కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జికింద డ్రైనేజీ వ్యవస్థ ఉందా? లేదా? అన్నట్టే ఉంది. డ్రైన్‌పైనే మొదటి ఘాట్ ప్రారంభంలో పోలీస్ అవుట్ పోస్టు నిర్మించారు. అక్కడినుంచి బ్రిడ్జి ప్రదేశం మీదుగా రెండో ఘాట్ రోడ్డు వరకు సుమారు 500 మీటర్ల మేర పైకప్పు తొలగించగా, కొన్నిచోట్ల మట్టితో నిండిపోయింది. సమన్వయలోపంతో డ్రైన్ శుభ్రపరిచే బాధ్యత దేవస్థానం, వైటీడీఏ శాఖలు చేపట్టడంలేదు.

10 ఫీట్ల ఎత్తులో..

కొండచుట్టూ నిర్మించిన డ్రైనేజీలో రాళ్లు, చెతాచెదారం తొలగించకుండానే పైకప్పు వేసి ఫుట్‌పాత్‌గా మార్చారు. లోతట్టుగా ఉన్న చోటకు వర్షపు నీరు చేరి పట్టణంలో మున్సిపల్ రోడ్లపై రెండుమూడు రోజుల పాటు పారుతోంది. వైకుంఠద్వారం ఎదురుగా అంజనేయస్వామి ఆలయం వద్ద సుమారు 10ఫీట్ల ఎత్తులో నిర్మించిన రోడ్డుపై చేరిన వర్షపు నీరు పట్టణ రోడ్లపైనే కాక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మసీదు వరకు నిర్మించిన అండర్‌డ్రైన్‌లో నీరు నిలిచి ఉంటుంది. వర్షపు నీరు పట్టణ రోడ్లపైకి రాకుండా ప్రత్యేకంగా డ్రైన్ నిర్మించినప్పటికీ రోడ్లపైనే నీళ్లు పారుతున్నాయి. రింగ్ రోడ్డు, పట్టణ రోడ్డు గుండా ప్రయాణించే వాహనాదారులు, పాదచారులకు పూర్తి అసౌకర్యంగా ఉంది.

ప్రధాన సర్కిళ్ల గుండా స్టాం వాటర్ డ్రైన్

2022 మార్చి 28 ఆలయం ఉద్ఘాటన వరకు రోడ్ల పరిస్థితిపై అధికారులు, పట్టణ ప్రజలకు అవగాహన రాలేదు. కొండచుట్టూ యాదగిరిపల్లి రెవెన్యూ పరిధిలోని అభయాంజనేయ సర్కిల్ (వైకుంఠద్వారం), గాంధీనగర్, నల్లపోచమ్మ ఆలయం, ఊరకుంట, గరుడ సర్కిల్ (సెంట్రల్ పార్కింగ్), యాదర్షి సర్కిల్ (గండి చెరువు), యాదవనగర్, మొదటి ఘాట్ రోడ్డు కలుపుకొని నాలుగు లేన్ల రోడ్డుతోపాటు ఇరువైపుల పటిష్ట అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. కానీ, ఈ వ్యవస్థ సమాంతరంగా నిర్మించకపోవడంతో వర్షపు నీరు వెళ్లేందుకు దారి సరిగాలేదు. వైకుంఠద్వారం వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్లే మార్గంలో డ్రైనేజీ నిండి పట్టణ వీధులవెంట రోడ్లుపైనే నీరుపారుతోంది. క్షేత్రానికి పడమర దిక్కునుంచి యాదర్షి సర్కిల్‌నుంచి గరుడ సర్కిల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఎస్సీ కాలనీ మీదుగా వంగపల్లి చెరువులోకి డ్రైనేజీ నీరు వెళ్తోంది.

వర్షం నీరు నిలిచే అవకాశం లేదు

కాల్వలో వర్షం నీరు నిలిచేందుకు అవకాశమే లేదు. ఒకవేళ భక్తులు వదిలేసిన ప్రసాదాల కవర్లు ఇతర చెత్త, చెదారం పేరుకుపోయి ఉంటే మాత్రం శుభ్రం చేయిస్తాం. దేవస్థానం చేయాల్సిన పనులు మేం చేయాల్సి వస్తోంది. గతంలో సొంత నిధులతో శుభ్రం చేయించాం. అవసరం మేరకు మరోసారి పరిశీలించి శుభ్రం చేయిస్తాం.
ఎన్. శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈ, ఆలేరు

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో..

విజ్ఞాన్ అధ్యాపకుడికి చోటు



ఎండీ రహమాన్‌ను అభినందిస్తున్న లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): యూఎస్ఏలోని కాలిఫోర్నియా ప్రాంతంలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో దేశ్‌ముఖి విజ్ఞాన్ యూనివర్సిటీలోని మెకానికల్ విభాగానికి చెందిన డాక్టర్ ఎండీ రహమాన్ ప్రపంచ టాప్ 2% శాస్త్రవేత్తల జాబితాలో నిలిచారని యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన యూనివర్సిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వారు ఆగస్టు 2025 సంవత్సరం వరకు ఉన్న ఉత్తమ సైంటిస్టుల డేటాను తీసుకోవడంతోపాటు స్టాండర్డ్ సైన్స్ మ్యాట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 44 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్‌ఫీల్డ్స్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించారని తెలిపారు. ఇందులో విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన అధ్యాపకుడు డాక్టర్ ఎండీ రెహమాన్ ప్రచురించిన రీసెర్చ్ పేపర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వరల్డ్ టాప్ 2% సైంటిస్టుల్లో గుర్తించారని తెలిపారు. వీరితోపాటు వడ్లమూడి విజ్ఞాన్ క్యాంపస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ అంబటి రంగారావు, డాక్టర్ కే.చంద్రశేఖర్, ఫార్మసీ డిపార్ట్‌మెంట్ టి.సుబ్బయ్యలు వరల్డ్ టాప్ 2% సైంటిస్టుల్లో నిలిచారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రొఫెసర్లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆయా విభాగాల డీన్‌లు, అధిపతులు, సిబ్బంది అభినందించారు.

పెంచికల్‌దిన్న పీఏసీఎస్ చైర్మన్ సస్పెండ్

నేరేడుచర్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ను పదవి నుంచి తొలగిస్తూ జిల్లా సహకార సంఘం అధికారి పద్మ శనివారం ఉత్తర్వులిచ్చారు. సంఘం నిధులను సొంత అవసరాలకు వాడుకుంటూ ఉన్నతాధికారుల నోటీసులకు స్పందించకపోవడంతో సస్పెండ్ చేసినట్లు సంఘం సీఈవో వెంకన్న తెలిపారు. ఆయనతోపాటు సంఘం డైరెక్టర్ వల్లంశెట్ల నారాయణను కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సస్పెండ్ అయిన శ్రీకాంత్ స్థానంలో వైస్ చైర్మన్‌గా ఉన్న సిద్ధపంగ శ్రీనుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

పులిచింతలలో కేఆర్ఎంబీ చైర్మన్

చింతలపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టును శనివారం కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ బీపీ పాండే పరిశీలించారు. స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా డ్యాంపై సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. "నేను చెత్త వేయను, ఇతరులను చెత్త వేయనివ్వను, నా ప్రాంతంలో, నా గ్రామంలో, పని ప్రదేశంలో పరిశుభ్రత కోసం కృషి చేస్తా" అనే నినాదంతో ప్రతీ ఒక్కరు పని చేయాలన్నారు. అనంతరం జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆళ్ల గోపాలకృష్ణ, ఈఈ గుణకర్‌రావు, డీఈ వెంకట్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పండుగ రద్దీ

● సెలవులకు ఇంటి బాట పట్టిన విద్యార్థులు



భువనగిరిలో బస్సుకోసం ప్రయాణికుల పాట్లు

భువనగిరి టౌన్, సూర్యాపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బస్సులలో దసరా సెలవుల రద్దీ పెరిగింది. పాఠశాలలకు పండుగ సెలవులు ప్రారంభంకావడంతో స్వగ్రామాలకు ప్రయాణాలు కట్టారు. దీంతో భువనగిరి, సూర్యాపేట బస్టాండ్లలో శనివారం ప్రయాణికుల రద్దీ కొనసాగింది. బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే హాస్టల్, గురుకుల పాఠశాలల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను బైకులపై తీసుకెళ్లగా, మరికొంత మంది బ్యాగులతో ఊరెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. రహదారులపై కూడా పండుగ రద్దీతో ట్రాఫిక్ గణనీయంగా పెరిగింది.

హైవేపై దసరా సందడి

చౌటుప్పల్ రూరల్: విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రారంభం కావడం, ఆదివారం జరిగే బతుకమ్మ పండుగకుతోడు వీకెండ్ కావడంతో ప్రజలు అధికసంఖ్యలో రాజధాని నుంచి స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. జాతీయ రహదారిపై అధికసంఖ్యలో వాహనాలు బారులుదీరి విజయవాడ వైపు బయలుదేరాయి. ప్రజలతో బస్టాండ్లు, ఆటోస్టాండ్‌లు కిటకిటలాడాయి. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ రద్దీ నెలకొంది. వాహనాలు బారులు దీరాయి. 16 గేట్లకు 9 గేట్ల ద్వారా వాహనాలను విజయవాడ వైపు పంపించారు.



సూర్యాపేట బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు





నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, జస్టిస్ కే.శరత్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాతసేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.9,15,946 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.శరత్ గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

దేవస్థానంలో టెండర్ల నిర్వహణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో టెండర్ల ప్రక్రియను అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ సమక్షంలో శనివారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో టెండరుదారులు వేలంపాటలో పాల్గొనగా గతంకంటే తక్కువ రేటు వచ్చింది. సీల్డ్ టెండర్లు తెరిచినప్పటికీ రేటు ఆశాజనకంగా లేదు. పాతగుట్ట వాహన పార్కింగ్‌కు ఆరు టెండర్లు, కొండకింద గుండం వద్ద ఫొటో స్టూడియో 2, కొండకింద బస్టాండ్ ఎదురుగా 4 (18,49,53,56) దుకాణ సముదాయాలు, భువనగిరిలో 16వ దుకాణం, కొండపైన, కింద చెప్పులు, కొండకింద కొబ్బరికాయల నిర్వహణ, కొండపైన, కింద కార్తీక దీపారాధనలు తదితరాలకు టెండర్లు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో గజ్వేల్లిరఘు, పర్యవేక్షకుడు యాస రాకేషరెడ్డి పాల్గొన్నారు.

మట్టపల్లిలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

మఠంపల్లి: మట్టపల్లిక్షేత్రంలో పవిత్రోత్సవాల్లో ప్రధాన క్రతువైన సుదర్శన యంత్రస్థాపన శనివారం శాస్త్రోక్తంగా కొనసాగింది. రాత్రి అగ్ని ధ్యానం, పంచశయ్యాధివాసాలు, అష్టమంగళ పంచాయుధ స్థాపన నిర్వహించారు. కార్యక్రమాలను యాజ్ఞికులు బొర్రా వాసుదేవ శర్మ, ఆలయ ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు నిర్వహించారు. ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తుమాటిశ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు ఖండాంతర ఖ్యాతి

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యాంకోశి



టూరిజం సెంటర్‌ను పరిశీలిస్తున్న జస్టిస్ శ్యాంకోశి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చీరలకు ఖండాంతర ఖ్యాతి ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యాంకోశి కితాబిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రూరల్ టూరిజం సెంటర్ పరిశీలించి, మ్యూజియంలోని లీవ్‌టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించారు. చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. పోచంపల్లి చేనేత మగ్గంపై వస్త్ర తయారీని ఆయన స్వయంగా పరిశీలించి, పోచంపల్లి ఇక్కత్ డిజైన్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. అనంతరం స్థానిక చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. కార్మికుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు అందించే పథకాలపై జిల్లా చేనేత, జౌళీ శాఖ ఏడీ శ్రీనివాస్‌రావును అడిగి తెలుసుకున్నారు. కార్మికుల కళాత్మక నైపుణ్యాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగి పురుగు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



లింగాకర్షక బుట్టలపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ పద్మావతి

గరిడేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వరిలో మొగి పురుగు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని భారతీయ వరి పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్. పద్మావతి అన్నారు. శనివారం మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకేలో మొగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగాకర్షక బుట్టల వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి శాస్త్రవేత్త డి.నరేష్, ఏ.కిరణ్, డి.ఆదర్శ్ పాల్గొన్నారు.

నాగారం: రైతులకు తక్కువ ధరలో నాణ్యమైన విత్తనాలను అందించాలనే సంకల్పంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విత్తనోత్పత్తి పథకంలో భాగంగా మండలంలోని నాగారం, వర్ధమానుకోట గ్రామంలో సాగుచేసిన వరి, పెసర పంటలను కంపసాగర్ కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.స్వాతి, ఎన్.నలిని, ఏవో కృష్ణకాంత్, ఏఈవోలు సాయిరాజు, బి.సంధ్య, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మఠంపల్లి: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని జయశంకర్ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్త సంధ్యారాణి సూచించారు. మండల పరిధిలోని కొండాపురం, చిలుకూరు, ఆచార్యులగూడెం, దూదియాతండాలో వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్, ఏఈవోలు శిరీష, చంద్రశేఖర్, త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



అర్వపల్లిలో యూరియా కోసం ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

అర్వపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యూరియాకోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. సమయానికి యూరియా రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శనివారం జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో రైతులు ఉదయం 4గంటల నుంచే యూరియాకోసం ఎదురు చూశారు. 800 బస్తాల యూరియా రావడంతో ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. యూరియా సరిపడా ఇవ్వాలని ఆందోళకు దిగారు. ఎస్ఐ సైదులు, ఏఎస్ఐ రాంకోటి, తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో గణేష్, ఏఈవో సత్యం రైతులకు క్యూలైన్ ఏర్పాటు చేసి మధ్యాహ్నం వరకు రశీదులు ఇచ్చారు. ఒక్కో రైతుకు బస్తా యూరియా అందజేశారు.

సీఐ పర్యవేక్షణలో యూరియా పంపిణీ

నిడమనూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలకేంద్రంలోని పీఏసీఎస్ గోదాము వద్ద హాలియా సీఐ సతీష్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు రోజులుగా రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్నారు. యూరియా అందడం లేదని ఆగ్రహిస్తున్న రైతులు నిత్యం ధర్నా చేస్తున్న నేపథ్యంలో సీఐ దగ్గరుండి క్యూలైన్‌లో ఉంటున్న ప్రతీ రైతుకు రెండు బస్తాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సొసైటీలోని కొందరు సిబ్బంది యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని రైతుల నుంచి ఆరోపణలు వస్తున్న తరుణంలో సక్రమంగా సరఫరా చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్ యార్డులో ముందుగా టోకెన్లు ఇచ్చి గోదాము వద్ద యూరియాను పంపిణీ చేస్తున్నారు. శనివారం సొసైటీకి ఒక లోడు 20 మెట్రిక్ టన్నులు(444) బస్తాల యూరియా వచ్చింది. తెల్లవారుజామునుంచే రైతులు అధిక సంఖ్యలో యూరియాకోసం సొసైటీకి చేరుకున్నారు. పంపిణీ ఏర్పాట్లను సీఐ సతీష్‌రెడ్డి కట్టుదిట్టం చేసి ముందురోజు టోకెన్లు ఉన్న రైతులకు ముందుగా సరఫరాచేశారు. క్యూలైన్‌లో ఉన్న రైతులకు పద్ధతి ప్రకారం రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయించారు. మిగిలిన రైతులకు టోకెన్లు ఇచ్చి మరుసటి రోజు యూరియా లోడు రాగానే సక్రమంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో బుచ్చాల జానయ్య, ఏఈవో దండెం విజయచంద్ర, హెచ్‌సీ కుంచం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఉద్యమించాలి

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలిసికట్టుగా ఉద్యమించి పరిష్కరించుకోవాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం జనగాం క్రాస్ రోడ్డులో నిర్వహించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. పదోన్నతులు కల్పించాలని డిమాండ్‌చేశారు. ముందుగా ద్విచక్ర వాహనాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూర్యాపేట డిస్కం అధ్యక్షుడు వేణు, కార్యదర్శి సాయిబాబు, రాష్ట్ర నాయకులు రాజేంద్ర, వరప్రసాద్, జనార్ధన్‌రెడ్డి, ఎస్.వెంకన్న, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సమగ్ర శిక్షణ కార్యాలయానికి బీరువా బహూకరణ

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్షణ కార్యాలయ విభాగానికి సుధాకర్ పీవీసీ ఇండస్ట్రీస్ అధినేత మీలా మహాదేవ్ రూ.20వేల విలువ చేసే బీరువాను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కె.శ్రవణ్‌కుమార్, రాంబాబు, పూలమ్మ, శంకర్, ఉస్మాన్, వేణు, ప్రవీణ్, శ్రీధర్, స్వాతి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తుంగతుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ దయానందం అన్నారు. మండలంలోని అన్నారం జడ్పీహెచ్ఎస్‌లో శనివారం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి మాటాడారు. విద్యార్థులకు పౌష్టికాహారమైన ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. తాజా కూరగాయలు తీసుకు రావాలని వర్కర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలి



ఆత్మకూర్ (ఎస్) మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచిన వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మెరిగె మట్టపల్లి, వికలాంగుల సంఘం నాయకులు పిచ్చయ్య కోరారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆవేదన చెందారు. కార్యక్రమంలో శీలం శ్రీను, శ్రీనివాసు, పుల్లయ్య, రూపారాణి, వీరు, లక్ష్మీ, ప్రశాంతి, తారాబీ, శివ పాల్గొన్నారు.

● చిలుకూరు : ఆసరా పింఛన్లు పెంచాలని కోరుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6వేలు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పెంచి పెన్షన్ ఇవ్వాలన్నారు.అనంతరం కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, నాయకులు పిచ్చయ్య, బుచ్చమ్మ, సైదమ్మ, జానమ్మ పాల్గొన్నారు.

● గరిడేపల్లి : పింఛన్ పెంచాలని స్థానిక ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులు కార్యదర్శికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి, చందాల సైదులు, బరిగెల విజయ్‌కుమార్, ఆలంపల్లి శేఖర్, నకిరేకంటి రవి, గాంధీ, పవన్, వెంకన్న, బండ లక్ష్మమ్మరాములు, సైదులు, పున్నమ్మ, విజయ్, పుల్లయ్య పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్) : దివ్యాంగులు, వితంతువులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాతకుల రాజన్న, మండల అధ్యక్షుడు మేడి కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట వృద్ధులు, దివ్యాంగులు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ల పెంపును పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కు అందజేశారు. కార్యక్రమంలో కొప్పుల కళింగ రెడ్డి, నగరే కృష్ణ, బొడ్డు నవీన్, ములకలపల్లి వీరమ్మ, యాతాకుల ముత్యాలు, మధు, సాయి, కాంతమ్మ, ఎల్లమ్మ, పాపయ్య పాల్గొన్నారు.

● మోతె : మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ముట్టడి చేపట్టారు. కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు భైరపంగు విజయ్ నాయకులు బొల్లికొండ వెంకన్న, జంజిరాల సుదాకర్, కొండల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి సమస్య పరిష్కారానికి చర్యలు

చివ్వెంల సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటికి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్ తెలిపారు. మండలంలోని పాచ్యానాయక్‌తండాలో శనివారం మిషన్ భగీరథ పైపులైన్ పనులను ప్రారంభించి మాట్లాడారు. కొన్ని రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మా దృష్టికి రాగానే అక్కలదేవిగూడెం నుంచి పాచ్యానాయక్ తండావరకు పైపులైన్ మంజూరు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, మాజీ జడ్పీటీసీ రమేశ్ పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆర్‌ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు అంకతి అప్పయ్య, బీజేపీ నాయకులు చింతలపూడి ఉమ, బొలిశెట్టి కృష్ణయ్య కోరారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కొండా హరీష్, జనిగెల శ్రీను, యల్లయ్య, శ్రీనివాసు, జనార్ధన్, వెంకటేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్క. సోమయ్యగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న భవన నిర్మాణ కార్మికుల సమస్యల కోసం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అనంతుల మల్లయ్య, కొత్తపల్లి శివకృష్ణ, లకావత్ బాలాజీనాయక్, మల్లెపాక నాగేష్, కందుల నాగలక్ష్మి, రాజు, పద్మ పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

అర్వపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవచ్చని సుధాకర్ పీవీసీ మేనేజర్ అచ్యుత్‌శర్మ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలకు సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అందజేసిన ఫర్నిచర్‌ను శనివారం బహూకరించారు. హెచ్ఎం కుంభం ప్రభాకర్, గుండా రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో బీరవోలు సోమిరెడ్డి

అర్వపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని బీరవోలు సోమిరెడ్డి అన్నారు. మండలంలోని అడివెంల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు మడ్డి అంజయ్య, నిమ్మనగోటి బుచ్చిరాములుతో పాటు ఆలకుంట్ల దుర్గయ్య, ఆలకుంట్ల కృష్ణతో పాటు 20కుటుంబాలు శనివారం పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల సైదులు, పిట్టల సైదులు, పిట్టల జాని, బోయపల్లి రవి, మచ్చ లింగయ్య, బోయపల్లి సైదులు, జంపాల శివ, దోమల సైదులు, ఉత్తీర్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

చింతలపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల కార్యవర్గాన్ని శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా సాదె సురేష్, ప్రధాన కార్యదర్శిగా మైలారిశెట్టి వీరేంద్రవర్మ, గౌరవ అధ్యక్షుడిగా మద్దూరు వెంకటరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా మంచికంటి కళావతి, జిల్లా కౌన్సిలర్‌గా వెంకటరమణ, నాగేశ్వరరావును ఎన్నుకున్నారు.. ఎన్నికల పరిశీలకులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, ఎన్నికల అధికారిగా వి. నాగేశ్వరరావు వ్యవహరించారు.

ఉండ్రుగొండ ఆలయంలో ప్రత్యేక పూజలు

చివ్వెంల సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఉమామహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రపదమాస మాసశివరాత్రి సందర్భంగా పురోహితులు మనోహరశర్మ, శివరామకృష్ణ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీకృష్ణ కుమార్, కృష్ణమోహన్, డాక్టర్ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు సహకరించాలి



స్వచ్ఛతా హీ సేవా లో పాల్గొన్న పోలీసులు, మునిసిపల్ సిబ్బంది

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ బండి మోహన్ కోరారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మెరిగె అశోక్, సీతారాములు, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల మండల అధ్యక్షుడిగా మల్లయ్య



నూతనకల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా పెదనెమిల గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బాషనపల్లి మల్లయ్య ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

భూసమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం

నూతనకల్, సెప్టెంబరు 20,(ఆంధ్రజ్యోతి) : మండలంలో భూసమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం భూభారతి చట్టం ఉపయోగపడుతోందని తహశీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీలింగ్ చట్టం రాక ముందు భూములు కొనుగోలు చేసిన రైతులకు శాశ్వత భూమి హక్కు కల్పిస్తూ పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మొదటగా గుండ్లసింగారం గ్రామంలో ప్రారంభిస్తామన్నారు. మిగతా గ్రామాల్లో సైతం నిర్వహిస్తామని రైతులు అధైర్య పడవద్దన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా శంభులింగేశ్వరుడి కల్యాణం



మేళ్లచెర్వు శివాలయంలో మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరి, సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రాంతః కాలంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, ఏకాదశ రుద్రాభిషేకాలు, స్వామి వారికి పంచామృత అభి షేకాలు,పుష్పార్చన నిర్వహించిన అర్చకులు స్వామివారి కల్యాణం అనంతరం నీరాజనం మంత్రపుష్పం సమర్పించి స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.కార్యక్రమంలో ఈవో నాగెళ్ల శంబిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శంబిరెడ్డి, అర్చకులు, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ, కమిటీ సభ్యులు, శ్రీనివాసరావు సత్యనారాయణరెడ్డి, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించాలి



కలెక్టరేట్‌లో ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను తక్షణమే నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవో సుదర్శన్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. రైతులకు యూరియా లభించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా తయారీకి నూతన కర్మాగారం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా దుకాణాల ముందు పురుషులు, మహిళలు యూరియా కోసం పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వినతి పత్రం అందచేసిన వారిలో పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్‌కుమార్, ఖమ్మంపాటి రాము, హేమలత, ఎండీ. పాష తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన పంచాయతీ కార్మిక సంఘం మండల మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వం అధికారంలోకి రెండేళ్లు అయినా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్ఈఎస్ఐ కల్పించాలని అన్నారు. పంచాయతీ కార్మికురాలు ఉప్పలమ్మ అధ్యక్షతన జరి గిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు సైదులు, వెంకటి, మల్లికార్జున్, సైదులు, కొండలు, కిరణ్, పాల్గొన్నారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కనకదుర్గా ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాచిమంచి కొండయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. అన్నమయ్య భజనమండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో బాచిమంచి చంద్రశేఖర్, ఆకుల రాము, మన్నెం వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేష్ రెడ్డి, అరవిందరరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు 12 నెలలు వేతనాలివ్వాలి



కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఉపాధ్యాయులకు 12నెలలకు వేతనాలు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ అన్నారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కేంద్రంలోని శనివారంం ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సన్మానంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. సమాజాన్ని మార్చే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు పిల్లలమర్రి కళింగం, రవికుమార్, బొమ్మకంటి ఉపేందర్, జానయ్య, మహేష్, రాజశేఖర్, రవీందర్‌నాయక్, ఉషారాణి, లక్ష్మణ్, బాలకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

మునగాల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి బహుజన విద్యార్థి సంఘం నాయకులు కత్తి నాగబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పండుగలు సంస్కృతీ,సంప్రదాయాలకు ప్రతీక



కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చైర్మన్ కేశినేని శ్రీదేవి, ఉపాధ్యాయులు

కోదాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకని ఎస్ఆర్ఎం పాఠశాల చైర్మన్ కేశినేని శ్రీదేవి అన్నారు. శనివారం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బొమ్మల కొలువుతోపాటు, నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ విగ్రహాలను ప్రదర్శించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఎస్వీ, తేజ, శ్రీచైతన్య, బాలుర ఉన్నత పాఠశాలలో..

పట్టణంలోని ఎస్వీ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు రంగుల, రంగుల బతుకమ్మలనే పేర్చి ముందస్తు దసరా సంబరాలు చేసుకోవటం అభినందనీయమన్నారు. తేజ పాఠశాలలో విద్యార్థుల బతుకమ్మ అక్షరమాలలో కూర్చొని పండుగ సంబరాలు చేసుకున్నారు. ఆజాద్‌నగర్ శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మలను పేర్చి, ఆటలతో, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు జానకిరామయ్య, కొదారు అనిల్, ఎండీ సలీం షరీఫ్, విద్యార్థులు, పాల్గొన్నారు



కోదాడలో మాట్లాడుతున్న సైదేశ్వరరావు

● సూర్యాపేటఅర్బన్ : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందజేయాలని శ్రీలక్ష్మీవెంకటసాయి విద్యా సంస్థల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, కరస్పాండెంట్ కారింగుల బాలగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ కళాశాల్లో శనివారం బతుకమ్మ సంబురాలను ప్రారంభించి వారు మాట్లాడారు.విద్యార్థినిలు బతుకమ్మల ముందు నృ త్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, జ్యోత్స్న, నరేష్, ప్రభాకర్, వీరన్న, సుధాకర్, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.



సూర్యాపేట బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న శ్రీలక్ష్మీవెంకటసాయి విద్యా సంస్థల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, కరస్పాండెంట్ బాలగౌడ్

● జిల్లా కేంద్రంలోని బేబీమూన్ పాఠశాల్లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహాదేవ్ పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం మహాదేవ్‌ను పాఠశాల కరస్పాండెంట్ చిలుముల శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

● హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందాపురంలో గల ప్రభుత్వ ప్రాథమికపాఠశాల, ఎండీఆర్ పాఠశాలల్లో విద్యార్థినులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దామోదర్‌రెడ్డి, గొట్టె శ్రీనివాస్‌యాదవ్, నర్సిరెడ్డి, భూపాల్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని పలు పాఠశాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థినులు పాఠశాలలో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సంతోషంగా గడిపారు. సాయంత్రం ఆయా గ్రామాల చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమం

కోదాడటౌన్: కోదాడ పట్టణంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏక్ భారత్, శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం దసరా ఉత్సవాలు, బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థినీలు ఉపాధ్యాయురాలు బతుకమ్మలు పేర్చి గౌరీ పూజ చేసి తెలంగాణ బతుకమ్మ పాటలతో ఉత్సాహంగా, కోలాటాలు సంబురాలు నిర్వహించటం జరిగింది. అదేవిధంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పుల్లూరి వెంకట నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినీలతో కలిసి బతుకమ్మలను నిర్వహించారు.

బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించాలి



సద్దుల చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం సద్దుల చెరువు వద్ద మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డితో కలిసి బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. బతుకమ్మ పండుగకు విద్యుత్ లైట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, రమేష్, ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

సూర్యాపేటలో రాజకీయ వేడి

(5వపేజీ తరువాయి)

కార్యక్రమాలనైనా హాజరవుతూ కార్యకర్తలను ఉత్తేజపరుస్తున్నారు.

అధికారులకు సంకటం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం స్థానికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఉండడంతో అధికారులకు ఎవరి మాట వినాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎటుపాలు పోని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. సున్నితమైన సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. కోదాడ, హుజూర్‌నగర్ కాకుండా తుంగతుర్తి, సూర్యాపేటపై దృష్టిపెట్టారు. ఇక్కడ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్‌లో కూడా ఎటువంటి ఇబ్బంది కలుగకూడదని ఆయన ఆలోచిస్తున్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి కూడా ఏమాత్రం తగ్గకుండా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిండంతో పాటు శాసన సభలో కూడా తన గళాన్ని వినిపిస్తున్నారు. మొత్తం మీద నియోజక వర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఢీ అంటే ఢీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి.

అంగన్‌వాడీలో పోషణ మాసం

చింతలపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎర్రకుంట తండా అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతలు, తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, టీచర్ నగ్మా, ఆయా బుల్లి, పి వినయ్, ఏఎన్ఎం కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

చిలుకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆచార్యులగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న జనార్దన్ మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం హనుమంతరావు, ఐక్య వేదిక సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చిలుకూరు : మీటర్ రీడర్స్ యూనియన్ సమావేశం హైదరాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశా నికి వెళ్లకుండా శనివారం స్థానిక పోలీసులు నాయకులను అరెస్టు చేశారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.